

కిసాన్‌చౌక్‌లో అన్నదాత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే పాయల్ శంకర్

## 'గ్రీన్ ఇండియా చాలెంజ్'ను కొనసాగించాలి

**-ఎమ్మెల్సీ దండె విఠల్**

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 23: గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను కొనసాగించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మొక్కను నాటారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు ఇంటి పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

## రైతులకు అండగా ఉండాలి

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఘనంగా రైతు దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం,డిసెంబర్ 23: రాజకీయాలకు అతీతంగా అందరూ రైతులకు అండగా ఉండాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని కిసాన్ చౌక్‌లో అన్నదాత విగ్రహానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు సాజిద్‌ఖాన్, సుజాత, సంజీవ్ రెడ్డి, రైతు సంఘం నాయకులతో కలిసి శనివారం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. రైతుల కష్టమే అందరి జీవనానికి కారణమవుతోందన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక అయిన రైతులను కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలన్నారు. రైతు సంఘం నాయకుడు బండి దత్తాత్రి , గోవర్ధన్ యాదవ్, కొండ నారాయణ, లోకారి పోశెట్టి, కాళ్ల విఠల్, దర్శనాల మల్లేశ్, లంకా రాఘవులు, దారట్ల కిష్టు, సుహాసిని రెడ్డి, గణపతిరెడ్డి పాల్గొన్నారు.



ఖానాపూర్‌లోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

## వైభవంగా ముక్కోటి ఏకాదశి

**ముక్కోటి ఏకాదశి** పర్వదినాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని పూజలు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు మార్వాడీ ధర్మశాలను సందర్శించారు. **-ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23**



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు

# మక్కపైనే మక్కువ..

### ప్రత్యామ్నాయ పంటలవైపే రైతుల మొగ్గు

- వరికి స్వస్తి.. ఇతర పంటల సాగు
- నిర్మల్ జిల్లాలో 85 వేల ఎకరాల్లో మక్క
- ఎకరాకు 40-45 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2090
- బహిరంగ మార్కెట్‌లో రూ.2200-రూ. 2300

**ప్రత్యామ్నాయ పంటలపై** రైతులు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. వరికి బదులు ఇతర పంటలు సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో నిర్మల్ జిల్లాలో 85 వేల ఎకరాల్లో మక్కను సాగు చేస్తున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండడం, అధిక లాభాలు వస్తుండడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు వారికి సూచనలు, సలహాలందిస్తూ సహకరిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్, ధర ఎక్కువగా ఉండడంతో కూడా రైతులు మొగ్గు చూపుతున్నారు. *-నిర్మల్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ)*

నిర్మల్, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు చేస్తున్న సూచనలు సత్ఫలితాలిస్తున్నాయి. రైతువేదికల్లో తరుచూ సమావేశాలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సంగతి తెలిసిందే. అధికారుల సూచనలు పాటిస్తున్న జిల్లా రైతులు.. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధర ఉన్న మక్క సాగుకే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.2090 మద్దతు ధరను అందిస్తున్నది. అయితే గత రెండు మూడేళ్లుగా మొక్కజొన్నకు డిమాండ్ పెరగడంతో ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.2200 నుంచి 2300 వరకు చెల్లించి కొంటున్నారు. దీంతో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతేడాది యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 72 వేల ఎకరాల్లో మక్కను సాగు చేయగా ఈ సారి ఇప్పటికే 85 వేల ఎకరాల్లో మక్క పంట వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలోని లక్ష్మణచాంద, మామడ, సోన్, నిర్మల్, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాలతో పాటు ముథోల్ నియోజకవర్గంలోని



లోకేశ్వరం, భైంసా, కుంటాల మండలాల రైతులు అధికంగా మక్క సాగు చేస్తున్నారు. కాగా మిగతా పంటలైన శనగ 60వేల ఎకరాలు, వరి 75 వేల ఎకరాలు, 20-30 వేల ఎకరాల్లో నువ్వు, సన్‌ఫ్లవర్, వేరుశనగ తదితర పంటలు సాగయ్యే అవకాశం ఉన్నదని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

### అధిక లాభాలే కారణం

కాగా వరి పంట మాదిరిగా మక్కకు సాగు నీటిని అధికంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. పెట్టుబడి ఖర్చులు కూడా తక్కువే. ఆరుతడి పంట కావడంతో లాభాలు కచ్చితంగా వస్తాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు పసుపు ఇతర వాణిజ్య పంటలకు పెట్టుబడి ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో పాటు తెగుళ్లు సోకుతుండడం వల్ల దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతున్నది. అంతే కాకుండా మక్క పంట సాగులో పర్యవేక్షణ కూడా పెద్దగా అవసరం లేకపోవడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. అలాగే పండిన పంటకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం వంటివి రైతులను మక్కసాగు వైపు మళ్లిస్తున్నాయి. కాగా ఈ నెలాఖరు వరకు మాత్రమే మొక్కజొన్న సాగుకు అనుకూల సమయమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

### పెట్టుబడి ఖర్చులు తక్కువ...



*నాకున్న 10ఎకరాల్లో ఎనిమిదెకరాలు మొక్కజొన్న వేశాను. మిగతా రెండెకరాల్లో కూరగాయ పంటలు వేశాను. వరి, ఇతర పంటల సాగుతో పోలిస్తే మక్క సాగుకు పెట్టుబడి ఖర్చులు తక్కువ. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ. 20వేలు మాత్రమే ఖర్చవుతుంది. అన్నీ అనుకూలిస్తే పంట దిగుబడి ఎకరానికి 40 క్వింటాళ్ల నుంచి 45 క్వింటాళ్ల వరకు వస్తుంది. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర తక్కువగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం వల్ల పంటను అమ్ముకోవడానికి కూడా ఏ బాధ లేదు.* **-శ్రీనివాస్ రెడ్డి, మక్క రైతు (సిద్ధులకుంట)**

### వరికి ప్రత్యామ్నాయంగా మక్క సాగు..



*రైతులు సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న వ్యవసాయానికి భిన్నంగా పంటలు వేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని ఎప్పటికప్పుడు రైతులను చైతన్యపరుస్తున్నాం. ఈ కారణంగానే వరికి బదులు మొక్కజొన్న సాగుకు జిల్లా రైతులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. మక్క సాగులో తక్కువ పెట్టుబడి ఖర్చులతో అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. ఎకరాకు పెట్టుబడి ఖర్చులు పోను రూ. 60 వేల నుంచి రూ. 70 వేల ఆదాయం వస్తుంది.*

**-అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి (నిర్మల్)**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## రాజీమార్గంతో సత్వర పరిష్కారం

- ఇరువర్గాలు గెలిచినట్లే..
- బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్
- వాగ్ధారిలో న్యాయ విజ్ఞాన సదస్సు
- పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, డిసెంబర్ 23 : రాజీమార్గంతో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని, దీంతో ఇరువర్గాలు గెలిచినట్లే అవుతుందని బోథ్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండలంలోని వాగ్ధారి గ్రామంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ, బోథ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామాన్ని గుడుంబా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. విద్యాహక్కు, బాల్య వివాహాలు, మోటార్ వెహికిల్ యాక్ట్, సైబర్ నేరాలు, లోక్ అదాలత్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ గ్రామస్తులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులు ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. స్థానిక సర్పంచ్ గంగాదేవి, ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ సీఐ రాజమౌళి, న్యాయవాది హరీశ్, పంద్రం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా సాగుదాం

- ఆదిలాబాద్ జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ జనార్దన్ రాథోడ్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎదులాపురం, డిసెంబర్ 23: జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ముందుకెళ్దామని ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పూర్తి స్థాయిలో దూరం చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తమ దృష్టికి వచ్చిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. సభకు అటవీ శాఖ జిల్లా అధికారి రాకుండా సీనియర్ అసిస్టెంట్‌ను పంపించడంతో ఇది గ్రామసభ అనుకుంటున్నారా? అని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. అనంతరం ఇటీవల ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా గెలుపొందిన పాయల్ శంకర్, అనిల్ జాదవ్‌ను జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గణపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు శ్రీనివాస్, శంకర్, సురేశ్, మిల్క, రమేశ్ రాథోడ్, రాజలింగు, కిరణ్ కుమార్, జడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, గోక గణేశ్ రెడ్డి, బ్రహ్మానంద్, కుమ్ర సుధాకర్, అక్షితా పవార్, నల్ల వనిత, ఎంపీపీలు తుల శ్రీనివాస్, మార్శెట్టి గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కృషి

రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధి కోసం కృషి చేద్దాం. ఎన్నికల సమయంలో పార్టీల పరంగా విభేదాలు ఉన్నా వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దాం. నేరడిగొండ జడ్పీటీసీగా నాలుగున్నరేండ్లు జడ్పీలో సభ్యుడిగా కొనసాగి చాలా విషయాలు నేర్చుకున్నా. వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పూర్తిస్థాయి సహకారం అందించాలి.

**- అనిల్‌జాదవ్, ఎమ్మెల్యే. బోథ్**

### ఉపాధి నిధులు స్థానిక సంస్థలకు అందించాలి

ఉపాధి హామీ పథకం నిధులు నేరుగా స్థానిక సంస్థలకు అందించాలి. ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేసేలా జడ్పీ సమావేశంలో తీర్మానం చేయాలి. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం స్థానిక సంస్థల ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. స్థానిక సంస్థలు బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

**- పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్**

### కార్యాలయాల చుట్టూ తిప్పకోవద్దు..

పనుల కోసం ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలి. ఉట్నూర్ దవాఖానలోనే కాన్పులు జరిగేలా చూడాలి. అక్కడే 24 గంటల పాటు వైద్యులు, సిబ్బంది ఉండేలా చూడాలి. పీహెచ్‌సీల్లో వైద్యులను వెంటనే నియమించాలి. విద్య, వైద్య, అటవీ శాఖ సమస్యలను పరిష్కరించాలి.

**-వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే ఖానాపూర్**



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ వి.ఉమేందర్

## కూతురిని ప్రేమించాడని కక్ష పెంచుకొని..

- యువకుడిని హత్యచేసేందుకు కుట్ర
- కిరాయి హంతకులతో కలిసి పన్నాగం
- ఈ నెల 18న జీపుతో ఢీ-ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో తేలిన నిజాలు
- అదుపులో నలుగురు నిందితులు
- పరారీలో బీజేపీ కౌన్సిలర్ దంపతులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 23: కూతురిని ప్రేమించాడనే కోపంతో ప్రేమ ఓ తండ్రి కిరాయి హంతకులతో యువకుడిపై హత్యాయత్నం చేయించిన ఘటన ఆదిలాబాద్ జిల్లా మావల మండలకేంద్రంలో సంచలనం సృష్టించింది. కాగా, ఈ కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. స్థానిక మావల పోలీస్ స్టేషన్‌లో ఆదిలాబాద్ డీఎస్పీ వీ ఉమేందర్ సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్ కాలనీ కౌన్సిలర్ రఘుపతి కూతురు ఎస్సీ కులానికి చెందిన వంశీ అనే యువకుడితో ప్రేమలో పడింది. అయితే తొలుత రెండేళ్ల క్రితం వంశీని ఫామ్ హౌస్‌కు తీసుకెళ్లి రఘుపతి బెదిరించాడు. ఆ తర్వాత కూడా వంశీలో మార్పు రాకపోవడంతో, చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కేఆర్కే కాలనీకి చెందిన చౌహాన్ రవి, అతడి మిత్రుడు అశోక్‌ను కలిసి రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్లాన్‌లో భాగంగా జీపుతో గుద్దితే యాక్సిడెంట్ కేసుగా నమోదవుతుందని, అనుమానం రాదని భావించారు. ఒప్పందం మేరకు రవికి రూ.లక్ష అడ్వాన్స్ రఘుపతి ఇచ్చాడు. రఘుపతి భార్య అరుంధతి కూడా ఇందులో పాలు పంచుకుంది. వంశీ ఇల్లును రవికి చూపించారు. ఇక వంశీని చంపేందుకు పలుమార్లు రెక్కీ కూడా నిర్వహించారు. ఈ క్రమంలో ఈ నెల 18న శ్మశాన వాటిక దగ్గరలో వంశీ స్కూటీని బలంగా ఢీకొట్టారు. మళ్లీ రివర్స్ తీసుకొని వెళ్లే క్రమంలో జీపు స్తంభానికి ఢీకొంది. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. తదుపరి వంశీ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రూ. 50 వేలకు జీపు సమకూర్చిన రాజు, దిల్షాద్‌తో పాటు నిందితులు అశోక్, రవిలను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.18,500 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం మావల కౌన్సిలర్ రఘుపతి, అతడి భార్య అరుంధతి పరారీలో ఉన్నారు. కాగా రఘుపతి బీజేపీకి చెందిన కౌన్సిలర్ గా కొనసాగుతున్నారు.





## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

**నిర్మల్ పట్టణంలోని** అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి క్రిస్మస్ కార్నివల్‌కు హాజరై కేక్‌ను కట్ చేసి సంబురాల్లో పాల్గొన్నారు. పండుగల ద్వారా భక్తిభావం పెంపొందుతుందని తెలిపారు. **- నిర్మల్ అర్బన్, డిసెంబర్ 23**

## ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

### బాలుర విజేత ఆదిలాబాద్, బాలికల విజేత నిజామాబాద్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 23: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న అండర్-17 సాఫ్ట్‌బాల్ 67వ ఎస్జీఎఫ్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొనగా, బాలుర విభాగంలో 10, బాలికల విభాగంలో పది జట్లు పాల్గొన్నాయి. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో ముగిసిన ఫైనల్స్ బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు విన్నర్‌గా, నిజామాబాద్ రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో నిజామాబాద్ విన్నర్‌గా, మహబూబ్‌నగర్ రన్నర్‌గా నిలిచింది. పరీక్షల సహాయ అధికారి, ఇన్‌చార్జి డీఈవో పద్మ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు, మెడల్స్‌ను బహూకరించి మాట్లాడారు. డీఐఎస్ఓ నఫేఖాన్, పెటా జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి భోజన్న, రాష్ట్ర పరిశీలకులు గంగాధర్, నాగరాజు, స్వామి, పీఈటీలు అన్నపూర్ణ, రమణారావు, జమున, వెన్నెల, దయానంద్, లింబా(కె) ప్రధానోపాధ్యాయులు మిట్టపెల్లి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.





మొదటి బహుమతిని అందుకుంటున్న ఆదిలాబాద్ బాలుర జట్టు


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677